RNI Regd No. 06225/99

## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు - 3 భాగాలు | 750.00 |
| 2. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 320.00 |
| 3. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 4. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 5. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 6. | సూర్యకిరణ విజ్ఞానము | 110.00 |
| 7. | ఆహార విజ్ఞానము | 110.00 |
| 8. | వేదమయ జీవనము | 90.00 |
| 9. | రహస్య జ్యోతిర్విద్య | 60.00 |
| 10. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 11. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 12. | అనుగ్రహ మాలామంత్రము | 30.00 |
| 13. | టైమ్ మేనేజ్‌మెంట్ | 25.00 |
| 14. | విశిష్ట యోగసాధనలు - 1 | 25.00 |
| 15. | త్రిముఖీ గాయత్రీమాత ధ్యానవిధానము | 25.00 |
| 16. | శ్రీసూక్తము | 20.00 |

**ప్రతులకు :**

| | | |
|---|---|---|
| ✧ గురు సీతారామ్ | భీమవరం | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే విశ్వము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ, మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక



28.6.2014 న మౌంట్ శంబళాలో మాస్టరుగారు

రూ. 20.00 జూన్ 2014 (102)

## విషయ సూచిక


- ✧ 24,000 రోజుల దివ్య జీవనానికి ముగింపు పలికిన మాస్టరుగారు 4
- ✧ "నిజమైన అనామకుడిని" అనే మాటను సార్థకం చేసుకున్నారు 10
- ✧ నన్ను కలవాలి అంటే "అఖండ గురుసత్తా" కూడా విజిటింగ్ కార్డ్ చూపించాల్సిందే! 16
- ✧ ఇంకొక 1500 సంవత్సరాలకు కానీ నన్ను ఎవరూ గుర్తించలేరు 25
- ✧ మాస్టరుగారి అభిమానుల సమ్మేళనం 30


పత్రిక అడ్రసు మారినది. గమనించ ప్రార్థన


సంపుటి - 9 సంచిక - 6

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 240.00

కంట్రిబ్యూషన్ 1000.00

ఫోన్ నెం. : 90106 47325
78421 33860

చందా పంపించవలసిన చిరునామా :

పి. సీతారాముడు
కోమటిగుంట, సీసలి (పోస్టు)
కాళ్ళ మండలం, ప.గో. జిల్లా - 534 237

ఆంధ్రా బ్యాంక్ ఆన్‌లైన్ ఎకౌంట్ నెం
00461 00110 20050
IFSC Code : ANDB 0000046

Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusatta Printers, Komatigunta and Published at Komatigunta, Kalla Mandal, W.G. Dt., A.P.

Editor : P. Sita Ramudu






రేపల్లె వాస్తవ్యులు
శ్రీ బొలిశెట్టి అనూరాధ, భవానీ శంకర్ దంపతులు
మరియు వారి కుమార్తె, అల్లుడు
సౌమ్య, ప్రపూర్ణ, నాగ ప్రవీణ్ దంపతుల సౌజన్యంతో
ఈ సంచిక వెలువడినది

వారికి మాస్టరుగారి యొక్క శుభాశీస్సులు
నిరంతరము లభించునుగాక!

గురు సీతారామ్

# 24,000 రోజుల దివ్య జీవనానికి ముగింపు పలికిన మాస్టరుగారు





అక్టోబరు 14, 1948 న జన్మించిన మాస్టరుగారు (డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ గారు) జూన్ 30, 2014 న తన భౌతిక శరీరాన్ని వదిలివేశారు.

ఆయన ఇంత సడన్‌గా శరీరాన్ని వదిలి వేస్తారు అని ఎవరూ ఊహించ లేదు. అందులోను ఆయన ఇంత సాధారణంగా తన భౌతిక జీవితానికి ముగింపు పలుకుతారు అని ఎవరూ భావించలేదు.

జీవితాన్ని గాయత్రీమయంగా జీవించిన పూజ్య గురుదేవులు పండిత శ్రీరామ శర్మ ఆచార్య తన భౌతిక శరీరాన్ని గాయత్రి జయంతి రోజున వదిలి వేశారు. అంతే కాకుండా ఆ విషయాన్ని సన్నిహితులకు ఆయన ముందుగానే తెలియజేశారు.

ఇంత కాలం తమ జీవితంలో భాగంగా ఉన్న మాస్టరుగారు ఇక లేరు అనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టంగానే ఉన్నప్పటికి,

సిద్ధ పురుషులు అయిన మాస్టరుగారు,
మహా మహిమోపేతులు అయిన మాస్టరుగారు,
అవతారమూర్తి అయిన మాస్టరుగారు,
సద్గురువులకే సద్గురువు అయిన మాస్టరుగారు,
తన భౌతిక శరీరాన్ని ఇంత సాధారణంగా వదిలివేయడం చాలా మందికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఇఫ్ ఇటీజ్ సింపుల్, ఇటీజ్ గ్రేట్" అనే ఐన్‌స్టీన్ వాక్యాన్ని తరచుగా ప్రస్తావించే మాస్టరుగారు, తన భౌతిక జీవన యానాన్ని కూడా అంతే సింపుల్‌గా ముగించారు.

కానీ మాస్టరుగారి సింపుల్ జీవితం వెనకాతల ఎంత అద్భుతమైన దైవీ ప్రణాళిక ఉందో 12.7.14 న నాకు సూచాయగా గుంటూరులో అర్థమైంది.

మాస్టరుగారి పెద్దకర్మ (13 వ రోజు) గుంటూరులోని సప్తఋషి ఆశ్రమం లో జరిగింది. అక్కడ ఒక బ్యానర్‌ని ఈ క్రింది విధంగా పెట్టారు.

దేవ మానవుడు వచ్చారు.
24,000 రోజుల దివ్య జీవనాన్ని జీవించారు, వెళ్ళిపోయారు.
మనం ఎవరమూ గుర్తించలేదు.

ఈ 24,000 రోజుల దివ్య జీవనం అనే వాక్యం చదవగానే కొంచెం షాక్ అయినట్టు అనిపించింది.

**ఎందుకంటే,**

ఆయన యొక్క చేతనత్వం స్థాయి గురించి కొద్దో గొప్పో అవగాహన ఉంది. అయినప్పటికీ ఆయనకు దూరంగానే ఉండిపోయానే, ఆయనను ఏమీ ఉపయోగించుకోలేకపోయానే అనే బాధ లోపలి నుండి కొంచెం తన్నుకొచ్చింది.

- "24 కోట్ల సంవత్సరాల తరవాత మానవజాతికి లభించిన అద్భుతమైన కాలం ఇది,
- ఈ కాలం దాటితే ఇంకొక 24 కోట్ల సంవత్సరాలకు కానీ మీకు ఇటువంటి అవకాశం రాదు" అని నెత్తీ నోరూ కొట్టుకున్న మాస్టరుగారు,
- తన జీవితానికి కూడా 24,000 రోజుల అవధిని నిర్దేశించుకోవడం ఆయన యొక్క చేతనత్వం స్థాయిని తెలియజేస్తోంది కదా అనిపించింది.

"మీరు ఏదో పిచ్చి వాళ్ళలాగా మాస్టరుగారిని వాళ్ళు మిస్‌లీడ్ చేస్తున్నారు. వీళ్ళు ఇన్‌ఫ్లుయెన్స్ చేస్తున్నారు అనుకుంటారుకానీ,

అవతారమూర్తి భూమి మీద తన సాధారణ ప్రయాణంలో కూడా ఎక్కడైనా ఆగి టీ త్రాగితే, అది కూడా ముందుగానే నిర్ణయింపబడి ఉంటుంది" అని మాస్టరుగారు పేర్కొనేవారు.



అందుచేత మాస్టరుగారి జీవిత అవధి 24,000 రోజులు అవడం కాకతాళీయం కాదు అని, ఒక అద్భుతమైన దైవీ ప్రణాళిక అని అనిపించింది.

24 అక్షరాల గాయత్రీ మంత్రానికి,
రామాయణానికి ఉన్న సంబంధం చాలా మందికి తెలిసిందే.

మనం ఇప్పటికీ కలలు కనే "రామరాజ్యాన్ని" త్రేతాయుగంలో మానవ జాతికి భగవంతుడు ఏ విధంగా అందజేశాడు అనే విషయాన్ని వాల్మీకి 24,000 శ్లోకాలలో రామాయణం అనే కావ్యంగా విశదపరిచాడు.

- ఆ 24,000 శ్లోకాలలో. ప్రతి వెయ్యి శ్లోకాలలోని మొదటి అక్షరం గాయత్రీ మంత్రంలోని ఒక అక్షరంతో మొదలవుతుంది.

**24 గంటలు ఒక రోజుగా ఉన్న భూమి మీద రామరాజ్యం ఏర్పడాలి అంటే,**

గాయత్రీ మంత్రం తెలియజేసే జీవిత విధానాన్ని మానవజాతి అనుసరించాలి అనే విషయాన్ని వాల్మీకి ఆ విధంగా తెలియజేశారు.

- త్రేతాయుగంలో శ్రీరాముడి కాలంలో రామరాజ్యం అయోధ్య పరిసర రాజ్యాలలో ఏర్పడింది అని,
- ద్వాపరయుగంలో మహాభారత యుద్ధం తరువాత ఆ రామరాజ్యం మొత్తం భారతదేశం అంతటా ఏర్పడింది అని,
- ప్రస్తుత సత్యయుగ పునరాగమన కాలంలో ఈ రామరాజ్యం ప్రపంచం అంతటా ఏర్పడాలి అనేది దైవీ ప్రణాళిక అని మాస్టరుగారు తెలియజేశారు.

ఈ దైవీ ప్రణాళికకు సారథ్యం వహించే మాస్టరుగారు,
సహజంగానే తన జీవిత అవధిని 24,000 రోజులుగా నిర్ణయించుకుంటే,
అందులో అతిశయోక్తి ఏముంది?

బ్యానర్ మీద 24,000 రోజులు అని వ్రాశారు కాని,

మాస్టరుగారి జీవిత అవధి ఎగ్జాట్‌గా 24,000 రోజులు అయివుండదు,

రెండు మూడు వందల రోజులు అటూ ఇటూ అయితే, దానిని రౌండ్ ఫిగర్‌గా 24,000 రోజులు అని బ్యానర్ మీద వేసివుంటారు అని భావించాను.

12.7.14 సాయంత్రం గుంటూరు నుండి విజయవాడ బస్సులో వస్తూ, సెల్‌ఫోన్‌లోని కాలిక్యులేటర్ మీద రఫ్‌గా మాస్టరుగారి జీవిత అవధిని లెక్కించ డానికి ట్రై చేశాను.

వెన్నులో కొంచెం వణుకు పచ్చింది.

కరెక్ట్‌గా లెక్కపెట్టలేదుకాని, రెండు మూడు రోజులు అటూ ఇటూగా 24,000 రోజులు అవుతుంది అనుకున్నాను.

మాస్టరుగారి మరదలు విజయా విశ్వనాథ్‌గారు ఫోన్ చేసినప్పుడు ఆయన జీవిత అవధిని 24,000 రోజులు అని మొట్టమొదట గుర్తించింది ఎవరూ అని అడిగాను.

అమలాపురానికి చెందిన శ్యామలరావుగారి అబ్బాయి "శ్రీరామ్" అట.

ఎంతటి ధన్యజీవో కదా అనిపించింది.

ఇటీవలి సంవత్సరాలలో మాస్టరుగారు వేసవికాలాన్ని బెంగుళూరులో ఎక్కువగా గడిపేవారు. అంతకు ముందు వేసవి కాలంలో అమలాపురంలో శ్యామలరావుగారి ఇంట్లోనే ఉండేవారు.

ఈ ఆర్టికల్ రెడీ చేయడానికి ముందు మాస్టరుగారి జీవిత అవధిని ఎగ్జాక్ట్‌గా లెక్కించడానికి ట్రై చేశాను.

ఒక్కసారిగా ఒళ్ళంతా గగుర్పాటుగా అనిపించింది.



మాస్టరుగారి జీవిత అవధి ఎగ్జాట్‌గా 24,000 రోజులు!

| | |
|---|---|
| మరణం | 30.6.2014 |
| జననం | 14.10.1948 |
| | 17. 8. 65 |

65 సంవత్సరాల 8 నెలల 17 రోజులు.

| | | |
|---|---|---|
| 65 సంవత్సరాలు x 365 | = | 23,725 |
| 1948 నుండి 2014 వరకు లీపు సంవత్సరాలు | = | 16 |
| 14.10.2013 నుండి 30.6.2014 వరకు | | |
| (17+30+31+31+28+31+30+31+30) | = | 259 |
| | | 24,000 |

మాస్టరుగారు తన శరీరాన్ని వదిలివేయడానికి ఒక ప్రత్యేకమైన తిథిని ఎన్నుకోలేదే అనేది చాలా మంది భావన!

కానీ తన జీవిత అవధిని సరిగ్గా 24,000 రోజులుగా నిర్ణయించుకోవడం అనేది చిన్న విషయం కాదుకదా!

ఒక అత్యద్భుతమైన దైవీ ప్రణాళికలో భాగంగానే ఇటువంటి దివ్య జీవితం భూమి మీద సాకారం అవుతుంది.

*నేను పరినార్ కార్యకర్తలతో ఒక మాట తరచుగా అంటూ ఉండేవాడిన్ని,*

మాస్టరుగారితో ఏ కొన్ని క్షణాలు గడిపినా అది మన అదృష్టమే.

కానీ ఏదో ఒక రోజు, అటువంటి వ్యక్తిని ఉపయోగించుకోలేకపోయామే అని బాధపడే రోజు వస్తుంది. చివరకు ఆ రోజు రానే వచ్చింది.

# "నిజమైన అనామకుడిని"
# అనే మాటను సార్థకం చేసుకున్నారు





"మాస్టరుగారు శరీరం వదిలేసిన విషయం ఏ పేపర్‌లోనూ పడలేదే! ఏ టీవీ ఛానల్‌లోనూ చూపించలేదే!"

మాస్టరుగారి గురించి కొద్దిగా పరిచయం ఉన్న చాలా మంది అడిగిన ప్రశ్న ఇది.

కానీ మాస్టరుగారు పేరు ప్రఖ్యాతులకు చివరి వరకూ దూరంగా ఉంటూ వచ్చారు. చివరన కూడా అదే పని చేశారు.

2006 జనవరిలో హైదరాబాద్‌లోని తేజశ్రీ వాళ్ళ ఇంట్లో స్వర్ణయుగము మాసపత్రికను తిరిగి ప్రారంభించమని చెబుతూ,

శ్రీ "నా గురించి ప్రాజెక్ట్ చేయకు!" అని చాలా స్పష్టంగా చెప్పారు.

అందుచేతనే గత 8 సంవత్సరాలలో మాస్టరుగారి సందేశాలను, జ్ఞానాన్ని పత్రికలో ప్రస్తావించడం జరిగింది తప్ప, ఆయనను ఎక్కడా ప్రాజెక్ట్ చేయడానికి ప్రయత్నించలేదు.

కానీ ఇప్పుడు ఆయన భౌతిక శరీరంతో లేరు కాబట్టి, ఆయన యొక్క దివ్యత్వం గురించి, ఆయన యొక్క స్థాయి గురించి కొద్దో గొప్పో తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను.

ఆశ్రమాలలో జరిగే కార్యక్రమాలకు ఎక్కువ మంది జనం రావడాన్ని కూడా మాస్టరుగారు అంతగా ఇష్టపడేవారు కాదు.

"ఎక్కువ మంది జనం ఈ క్లాసులకు వస్తున్నారు అంటే, నేను ఏదో అందరికీ కావలసిన సాధారణ విషయాలు చెబుతున్నాను తప్ప, ప్రత్యేక విషయాన్ని అందజేయడం లేదు అని భయపడతాను" అనేవారు.

ఆయన అనామకుడిగానే జీవించడానికి ఇష్టపడ్డారు.

ఆటమిక్ ఎనర్జీ గురించి రీసెర్చ్ చేసే సెంటర్స్‌లో జనం చాలా తక్కువగా ఉంటారు. ఇక్కడ కూడా అంతే అనేవారు.

ప్రాపంచిక జనుల కోరికల విష వలయాల నుండి తప్పించుకోవడానికి ఆ అనామకత్వాన్నే ఆయన ఒక రక్షణాకవచంగా ఉపయోగించుకునేవారు.

సమర్థ సద్గురువుల స్థాయి ముందు ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులూ కూడా ఎందుకూ కొరగారు.

అటువంటి ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులూ ఎంతో రక్షణ ఉంటే తప్ప ఎక్కడికీ వెళ్ళలేరే! అటువంటిది ఈయన ఇంత సింపుల్ ఎలా తిరగగలుగుతున్నారు? అనిపించేది.

సింధువు (సముద్రం) బిందువులో ఇమిడిపోయింది అనే రామకృష్ణ పరమహంస వాక్యం మాస్టరుగారి విషయంలో చాలా బాగా సార్థకం అవుతుంది.

"దోమ గొంతుకలోకి ఏనుగుల గుంపు ప్రవేశించింది" అనే అలంకారాన్ని తెనాలి రామకృష్ణుడు ఎంత అద్భుతంగా ప్రయోగించాడు అంటే,

అద్వితీయ పరాక్రమవంతులైన పాండవులు, విరటుని కొలువులోకి సేవకులుగా ప్రవేశించడం కూడా అలాంటిదే అట.

అవతారమూర్తులనే శాసించే చేతనత్వం
సాధారణ మానవుడిగా భూమి మీద జీవించడం కూడా అలాంటిదే.

మాస్టరుగారి యొక్క స్థాయి ఏమిటో,
ఆయన యొక్క లక్ష్యాలు, ఉద్దేశ్యాలు ఏమిటో,

14.5.97 న కాకివాయిలో ఇచ్చిన ఉపన్యాసంలో చాలా స్పష్టంగా తెలియజేశారు. ఈ దిగువన ఆ విషయాలను మళ్ళీ క్లుప్తంగా గుర్తు చేసుకుందాం.



(ప్రారంభం ......)

⊕ నాకు కొన్ని లక్ష్యాలు ఉన్నాయి.
నాకు కొన్ని ఆదర్శాలు ఉన్నాయి.
వాటి గురించి కొన్ని జన్మల బట్టీ నేను పనిచేస్తున్నాను.

ఆ లక్ష్యాలను నేను మరువలేదు. మరువను!
మీరేం చేస్తారు అన్నది మీ ఇష్టం!!

⊕ రామకృష్ణ మీద ప్రేమతో చేస్తే,
రేపు రామకృష్ణ మీద ప్రేమ ఉండకపోతే మానేస్తారు.

లక్ష్యాల మీద ప్రేమ ఉంటే రామకృష్ణతో సంబంధం లేదు మీకు.

లక్ష్యాలు ఇంపార్టెంట్ కదా!
దయచేసి రామకృష్ణను మర్చిపోండి.

మీరు రామకృష్ణ సద్గురుదేవ్ అంటారో,
ఏం నినాదాలు ఇచ్చుకుంటారో నాకేం అభ్యంతరం లేదు.

అది మీకు హెల్ప్ చేస్తోన్నంత వరకు,
మీ ఉన్నతికి అది దోహదం చేస్తే,
మీకు అది ఆనందం కలగజేస్తూ ఉంటే,
నాకేం అభ్యంతరం లేదు. మీరు ఏవైనా చేసుకోవచ్చు.

నన్ను అవతారమూర్తి అంటారా,
కచ్చితంగా అనండి.

ఎందుచేత అంటే,

నేను అవతారమూర్తి కంటే చాలా చాలా గొప్పవాడిని.

అందుచేత మీరు నన్ను అవతారమూర్తి అనటంలో
నన్ను కించపర్చటమే తప్ప,
నన్ను ఏం మీరు వృద్ధిలోకి పర్చటం లేదు.

*ఎందుచేత అంటే,*

మీరు నన్ను గుర్తించలేరు కనుక.

మీరు గుర్తించగలమనే అపోహలో మాత్రం ఉండకండి.
ఇప్పుడిప్పుడే ఎవరూ గుర్తించలేరు.

గుర్తించగలిగితే మీరు ఈ మాత్రం దగ్గరకి కూడా రాలేరు.

❀ గుర్తించగలిగితే ఒక శ్రీకృష్ణుడో, ఒక రాముడో
రెండు కిలోమీటర్ల దూరంలో ఉండి మాట్లాడతాడు నాతో.

గుర్తించలేకపోతే దానిదేముంది,
ఒక చీమ అయినా నెత్తికెక్కేస్తుంది.

ప్రశ్న మీరు నన్ను గుర్తించారా, గుర్తించలేదా అన్నది ఇంపార్టెంట్ కాదు అక్కడ. ఇంపార్టెంట్ ఏమిటంటే,

మీరు నా లక్ష్యాలను గుర్తించారా, లేదా?

కానీ నేనేం బాధపడను. ఎందుచేత అంటే, మీదు అంతే.

*కానీ మీరు అర్థం చేసుకోవలసింది ఏమిటంటే,*

ఒక దైవీ ప్రేరణ వల్ల, ఒక దైవానుగ్రహం వల్ల
అర్హత ఉన్నా, లేకపోయినా మీరు ఒక చోటకి చేరగలిగి పనిచేస్తున్నారు.

✧ మీకు అపోహలు, మానసిక ద్వేషాలు ఎందుకు వస్తున్నాయి అంటే.
మీకు లక్ష్యశుద్ధి లేదు



❀ ఇలాంటి గురువు ఎప్పుడూ మీ అనుభవంలోకి వచ్చివుండడు.

-- వీడు గురువూ కాదు, శిష్యుడూ కాదు.
స్నేహితుడూ కాదు, సన్నిహితుడూ కాదు. వీడు ఎవడో!

*నిజం చెప్పాలి అంటే,*

నిజమైన అనామకుడు.

మీరు నాకు ఏం పేరు పెట్టలేరు.

కానీ మీ ఆప్యాయత పేరు పెట్టుకోనిస్తుంది.
ఆ ఆప్యాయత పోగొట్టుకోకండి.

❖ మీరు ఏ దృష్టితో నన్ను ప్రేమించినా అదే రివర్స్ గేర్‌లో ఆపోజిట్‌గా అంత ప్రేమా నా నుంచి మీరు పొందగలరు.

-- దానికి మీరు ఈ కార్యక్రమాలు చేస్తేనే మీకు ఈ ప్రేమ వస్తుంది అని మాత్రం భ్రమలో ఉండకండి.

❀ కేవలము పూర్తి విశ్వాసంతో మానసికంగా నన్ను ప్రేమించగలిగితే,
మీ ఇళ్ళల్లో కూడా నేను లభిస్తాను.

దాని కోసం మీరు కాకివాయికీ రావక్కర్లేదు,
ఈ కార్యక్రమాలు అవీ చేపట్టక్కర్లేదు.


❖ ముందు ప్రేమ అనేటటువంటి బంగారం కనుక మీ దగ్గర ఉంటే,
ఆ బంగారాన్ని నేను కచ్చితంగా మలుచుకోగలుగుతాను.

-- అహంకారం ఉంటే, నేను కాదు కదా, ఆ భగవంతుడే ఏమీ చేయలేడు.

ఆ గురువులు మీకు సద్బుద్ధి ఇచ్చుగాక అని ప్రార్థన చేస్తూ,

స్వస్తి.

# నన్ను కలవాలి అంటే "అఖండ గురుసత్తా" కూడా విజిటింగ్ కార్డు చూపించాల్సిందే!




అఖండ గురుసత్తా



**మాస్టరుగారు ఆయన యొక్క ఉనికిని ఎంతగా మరుగు పరచడానికి ప్రయత్నించేవారు అంటే,**

ఆయన యొక్క స్థాయిని తెలియజేసే ఒక విశేషమైన విషయాన్ని ఎవరికీ చెప్పవద్దు అని ఆంక్ష విధించారు.

ప్రస్తుతము ఆయన భౌతిక శరీరంతో లేరు కాబట్టి,
ఆ విషయాన్ని పాఠకులకు తెలియజేస్తున్నాను.

కాకివాయిలోని శ్రీహంసరామ ఆశ్రమంలో 1996 దుర్గాష్టమి రోజున అర్ధరాత్రి 12 గంటలకు మాస్టరుగారు అనుగ్రహ మాలామంత్రాన్ని దీక్షగా ఇచ్చారు.

ఆ మంత్రాన్ని దీక్షగా ఇచ్చేటప్పుడు ఆయన గొంతు యొక్క శ్రావ్యత, అలౌకికత్వాన్ని ఇప్పటికీ సాధకులు మరిచిపోలేరు.

గంధర్వగానం గురించి మనకు తెలియదుకాని,
బహుశా ఆ గంధర్వ గానం కూడా ఆ స్థాయిలో ఉండదేమో!

- ఏకోఽహం బహుస్యామ. నేను ఒక్కడినే ఉన్నాను. అనేకంగా మారాలి అనే భగవంతుడి సంకల్పాన్ని నెరవేర్చడానికి పృథ్వీగ్రహం సృష్టించబడింది.
-- ఈ పృథ్వీగ్రహం మీద అనేక మంది భగవంతుడులు రూపుదిద్దుకోవలసి ఉంది. అనేక మంది మాధవులు తయారు కావలసి ఉంది.
-- అటువంటి మాధవులు తయారు కావడానికే పృథ్వీగ్రహం మీద మానవ జాతి ఆవిర్భవించింది.
-- ఈ మానవులే పరిణామక్రమంలో మాధవులుగా తయారవుతారు.

పరిణామక్రమంలో భూమి ఇప్పటి వరకు 23 సార్లు సృష్టించబడి, 23 సార్లు లయం అయింది అని మాస్టరుగారు చెప్పేవారు.

- గాయత్రీ మంత్రంలోని 24 బీజాక్షరాలు,
  ప్రస్తుతం 24 వ సారి సృష్టించబడి, మనుగడ సాగిస్తోన్న భూమి యొక్క 24 పరిణామక్రమాలకు సంబంధించినవి అని మాస్టరుగారు తెలిపారు.

**పృథ్వి యొక్క పరిణామక్రమంలో ప్రస్తుత కాలం యొక్క విశేషత ఏమిటంటే,**

పృథ్వి యొక్క పరిణామక్రమంలో సగభాగం పూర్తి అయింది.

అందుచేత 2000 సంవత్సరం వరకు అపవిత్ర గ్రహంగా ఉన్న పృథ్వి, 2000 నాటికి పవిత్ర గ్రహంగా దీక్ష తీసుకోవడమే కాకుండా, పృథ్వి మీద దేవమానవుల ఆవిర్భావం కూడా వేగవంతం అయింది.

ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్

అనే 24 బీజాక్షరాల పై గాయత్రీ మంత్ర సాధన వలన సాధకుడు కూడా పృథ్వి వలె 24 పరిణామక్రమాలను పూర్తి చేసుకుని, దేవమానవుడిగా మారటానికి, అమరుడిగా మారటానికి అర్హత సాధిస్తాడు.


పృథ్వి యొక్క పరిణామక్రమంలో మొత్తం 49 దశలు ఉంటాయి.

- గాయత్రీ మంత్రం ఇప్పటి వరకు జరిగిన పృథ్వి యొక్క 24 దశలకు సంబంధించినది అయితే,

-- 52 అక్షరాల అనుగ్రహ మాలామంత్రము పృథ్వి యొక్క మొత్తం 49 దశలకు సంబంధించింది.

- అందుచేత గాయత్రి, షోడశీ మంత్రాల యొక్క కలయికతో ఏర్పడిన ఈ క్రింది అనుగ్రహ మాలామంత్రము యొక్క సాధన మానవుడిని "పరిపూర్ణ మాధవుడి"గా తీర్చిదిద్దుతుంది.





ఓం భూర్భువః స్వః
హ్రీం శ్రీం క్లీం
తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియోయోనః ప్రచోదయాత్
హ్రీం శ్రీం క్లీం ఓం
క ఏ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం శ్రీం

ఈ అనుగ్రహ మాలామంత్రాన్ని దీక్షగా ఇచ్చిన తరువాత అక్కడ ఉన్న సాధకులు అందరూ మాస్టరుగారి దగ్గరకి పాద నమస్కారం చేయడానికి వెళ్ళారు.

అప్పుడు మాస్టరుగారు చాలా మంది సాధకులకు ఏదో ఒక సూచన చేశారు. నా ముందు ఉన్న అవతారంరాజు గారిని "ఈ జన్మలో లాగించేయండి" అన్నారు.

తరువాత నేను దగ్గరకి వెళ్ళినప్పుడు "భీమవరం షిఫ్ట్" అన్నారు.

అప్పటికి మేము భీమవరానికి 12 కి.మీ. దూరంలో ఉన్న మా స్వగ్రామం కోమటిగుంట గ్రామంలో ఉండేవాళ్ళం.

అందరికీ ఏదో సాధనాత్మకంగా సూచనలు చేసినప్పటికీ, నాకు మాత్రం ఆర్డర్ ఇచ్చారు కదా అని చాలా సంతోషించినప్పటికీ, మా గ్రామం నుండి నేను భీమవరం షిఫ్ట్ అవడం మాత్రం నా మనస్సుకి ఏ మాత్రమూ రుచించని విషయం.

అప్పట్లో నిద్రపోతూవుంటే మధ్యలో మెలకువ వచ్చి, "అయ్యో! నేను భీమవరానికి షిఫ్ట్ అవ్వాలా?" అని ఆవేదన పడేవాడిని.



మా ఊరిలో ఉన్న సంబంధ బాంధవ్యాలు అప్పట్లో అంత గాఢంగా ఉండేవి.

అందుచేత ఏ కారణం వలన నేను మా ఊరి నుండి భీమవరానికి షిఫ్ట్ అవలేనో తెలియజేస్తూ మాస్టరుగారికి ఒక లెటర్ వ్రాశాను.

ఆ తరువాత వారం, 10 రోజులకే మాస్టరుగారు కాకివాయి వెళుతున్నారు అని తెలిసి, నేను కూడా ఆయనతో కలిసి వెళ్ళడానికి గుంటూరు వెళ్ళాను.

మాస్టరుగారు, రామసుబ్బయ్యగారు, నేను, ఇంకా ఇద్దరు ముగ్గురు కార్యకర్తలు కలిసి ఒంగోలులోని రాజ్యలక్ష్మిగారి ఇంటికి, గాయత్రీ అనుగ్రహ పీఠానికి వెళ్ళి, అక్కడ నుండి కాకివాయి వెళ్ళాము.

ఆ రోజు రాత్రి జరిగిన సమావేశంలో మాస్టరుగారు నన్ను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఇతను ఒక లెటర్ వ్రాసి, నన్ను ఇరికించేశాడు. ఇప్పుడు నేను ఒక ముఖ్యమైన విషయం చెబుతున్నాను. దీనిని ఎవరికీ చెప్పకండి!" అని ప్రక్కనే ఉన్న టేప్ రికార్డర్ వైపు చూశారు.

అప్పట్లో మాస్టరుగారి ప్రతి ఉపన్యాసాన్ని రామసుబ్బయ్యగారు టేప్ చేసేవారు. అప్పుడు మాత్రం ఆ క్యాసెట్ రికార్డ్ అవడం లేదు.

"క్యాసెట్ రికార్డ్ అవడం లేదుకదా! ఓకె!" అంటూ,

ශ "నా స్థాయి ఏమిటంటే,
మనం ఏర్పాటు చేసుకున్న "గురుసత్తా"లోని గురువులు అందరూ నా దగ్గరకు రావాలి అంటే,
వాళ్ళ విజిటింగ్ కార్డు చూపించి, నా దగ్గరకు రావాల్సి ఉంటుంది."

-- "మీరు అందరూ కూడా ఇది వరకటి జన్మలలో ఈ గురువులు అందరికీ చాలా క్లోజ్‌గా జీవించినవారే!"

"అందుచేత మీరు ఏవైనా నిర్ణయాలు తీసుకునే ముందు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయించుకోండి" అంటూ,

"రాజ్యం కోసం భార్యను వదిలేశాడు ఒక రాజు!
ప్రేయసి కోసం రాజ్యాన్ని వదిలేశాడు ఇంకొక రాజు!
వీళ్ళు ఇద్దరిలో ఎవరు గొప్పవారు?"

ఈ విషయం ఆర్ఎస్ఎస్ వాళ్ళకు బాగా తెలుస్తుంది అనుకుంటా. నువ్వు చెప్పవయ్యా!" అంటూ నన్ను అడిగారు.

ఎందుకంటే, నేను మాస్టరుగారికి లెటర్ వ్రాసిన విషయం ఈ అంశానికి సంబంధించినది.

రాజ్యం కోసం భార్యను వదిలేసిన రాజు, శ్రీరాముడు.

ప్రేయసి కోసం రాజ్యాన్ని వదిలేసిన రాజు, బ్రిటన్ రాజవంశానికి చెందిన హెన్రీ 4 అనుకుంటా. అతను ఒక అమెరికన్ అమ్మాయిని ప్రేమించాడు. బ్రిటన్ దేశపు రూల్స్ ప్రకారం రాజవంశీయులు విదేశీ వనితను పెళ్ళి చేసుకుంటే, ఆ దేశానికి రాజు అయ్యే అర్హతను కోల్పోతారు.

అతను తన అమెరికన్ ప్రేయసి కోసం ఇంగ్లాడుకి రాజు అయ్యే అవకాశాన్ని వదులుకున్నాడు.

సమావేశం అయిన తరువాత మాస్టరుగారు దూరంగా ఉన్న టాయిలెట్స్‌కి వెళుతూవుంటే, నేను ఆయన వెంట వెళ్ళాను.

అప్పుడు ఆయన నా భుజం మీద చేయి వేసి, "నువ్వు ఇచ్చిన ఆ మాట కంటే, గురువులకు నువ్వు ఇచ్చిన మాట ముఖ్యం. ఏం చేయాలి అనుకున్నా, నీ ఇష్టం!" అన్నారు.



గురువు ఒకసారి నీ ఇష్టం అంటే, ఇంక చేసేది ఏముంది?
గురువుని వదులుకోలేము కదా!

ఆ విధంగా నవంబరు 20, 1996 న మా ఊరిలో బాంధవ్యాలను వదులుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తూ భీమవరానికి షిఫ్ట్ అయ్యాము.

ఆ తరువాత రెండు నెలలకే మాస్టరుగారు భీమవరం రావడం, 18.2.1997 న స్వర్ణయుగము మాసపత్రికను ప్రారంభించడం జరిగింది.

నేను భీమవరానికి షిఫ్ట్ అయిన తరువాత నా క్లోజ్ ఫ్రండ్ పట్టాభి ఏమన్నాడు అంటే,

శ్రీ "నువ్వు మీ ఊరి నుండి షిఫ్ట్ అయ్యావు అం...
నీ గురువు చాలా గట్టివాడురా!" అన్నాడు.

ఎందుకంటే, నేను మా ఊరి నుండి షిఫ్ట్ అవ్వను అని మా క్లోజ్ ఫ్రండ్స్ అందరికీ తెలుసు.

ఈ బ్యాక్‌గ్రౌండ్ అంతా వ్రాయడంలో నాకు వేరే ఉద్దేశ్యం ఉన్నప్పటికీ, ప్రధానమైన ఉద్దేశ్యం మాత్రం మాస్టరుగారి స్థాయిని తెలియజేయడమే.

"జగద్గురుసత్తా" పేరుతో మాస్టరుగారు ఈ దిగువ పేర్కొన్న 6 రకాలైన గురు జంటలను సెలెక్ట్ చేశారు. వారు,

స.వి.వి. - బ్లావెట్స్కీ
లాహిరీ మహాశయ - పరమహంస యోగానంద
అరవిందో - శ్రీమాతా మిర్రా
శ్రీరామశర్మ ఆచార్య - మాతా భగవతీదేవి శర్మ
రామకృష్ణ పరమహంస - శారదామాత
శిరిడీ సాయి - సత్యసాయి

ఈ జగద్గురుసత్తాకే తదుపరి మాస్టరుగారు "అఖండ గురుసత్తా"గా నామకరణం చేశారు. ఆ తరువాత "రమణ మహర్షి - జిల్లెల్లమూడి అమ్మ" జంటను ఈ అఖండ గురుసత్తాకి మాస్టరుగారు జత చేశారు.

***అఖండ గురుసత్తాగా ఈ గురువులను మాస్టరుగారు సెలెక్ట్ చేయడంలోని ఒక ప్రధానమైన ఉద్దేశ్యం ఏమిటంటే,***

ఈ గురువులు అందరూ కూడా ఈనాటి ఆధునిక భౌతికవాద కాలంలో ఆధ్యాత్మిక శక్తి యొక్క గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వారే.

ఈ గురువులు అందరికీ ఇప్పటికీ లక్షలాది మంది అనుయాయులు ఉన్నారు.

***మాస్టరుగారి యొక్క చేతనత్వం ఎంత గొప్పది అంటే,***

ఈ స్థాయి గురువులు అందరూ కూడా సూక్ష్మజగత్తులో మాస్టరుగారిని కలవాలి అంటే, డైరెక్ట్‌గా కలవలేరు.


వాళ్ళ విజిటింగ్ కార్డుని చూపించి,
ఏ పని మీద వచ్చారో ముందుగా చెప్పాల్సిందే.

- ఆ స్థాయి చేతనత్వం భూమి మీద 24,000 రోజులు చాలా అనామకంగా సంచరించింది.
- కానీ ఎంత అనామకంగా సంచరించినప్పటికీ, ఆ స్థాయి చేతనత్వం భూమి మీదకి ఊరికనే యథాలాపంగా రాదుకదా! తన స్థాయికి తగిన కొన్ని కార్యక్రమాలకు బీజారోపణ చేయడానికే వచ్చివుంటుందికదా!

ఆ బీజాలకు మనం నీరు, ఎరువు వేయగలిగితే
మన జీవితాలు ధన్యం అవుతాయి.



# ఇంకొక 1500 సంవత్సరాలకు కానీ నన్ను ఎవరూ గుర్తించలేరు



- "ఓ గురుదేవా! నీ యొక్క ఆర్తి, వ్యధ, కోట్ల సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వచ్చే ఈ కాలము యొక్క విలువ అర్థమయింది.
-- "ఇక నా విశుద్ధమైన భౌతిక, వ్యక్తిగత కోర్కెలకు ఉద్వాసన చెప్పి,
-- "నీవు నన్ను ఎటువంటి పరిస్థితులలో పెట్టినా,
స్థూల మానసిక వేదనలు ఎంత తీవ్రముగా ఉన్నప్పటికీ,
-- "మొత్తము ప్రపంచము ఎదురు తిరిగినా,
నీ లక్ష్య సాధన మాత్రమే నేను జీవించి ఉండటానికి ఏకైక కారణము"
అనే ఆర్తి "గురు పుత్రులు"గా దీక్ష తీసుకునే అర్హతను మీకు ఇస్తుంది.

మాస్టరుగారి యొక్క స్థాయిని గుర్తించడానికి చేసే ప్రయత్నంలో ఆయన చెప్పే రెండు కథల్ని మనం గుర్తు చేసుకోవాలి.

① నూతిలోని కప్ప - సముద్రంలోని కప్ప

② గుడ్డివాళ్ళు ఏనుగు ఆకారాన్ని వర్ణించడం

సముద్రంలో ఉండే ఒక కప్ప ఒకసారి దూరంగా ఉన్న ఒక నూతి దగ్గరకి వెళ్ళిందట. అందులో కూడా ఒక కప్ప ఉంది.

ఆ కప్ప సముద్రంలోని కప్పని "నువ్వు ఎక్కడ ఉంటున్నావు?" అని అడిగింది. "నేను సముద్రంలో ఉంటున్నాను" అంది.

"నీ సముద్రం ఎంత ఉంటుంది?" అని నూతిలోని కప్ప అడిగింది.

"అబ్బో! అది చాలా పెద్దది" అంది.

"అంటే, ఇంత ఉంటుందా?" అని ఆ నూతిలోనే ఒక అడుగు గెంతి అడిగిందిట. "అది చాలా చాలా పెద్దది" అంది సముద్రపు కప్ప.

"అయితే ఇంత ఉంటుందా?" అని నూతిలో సగం దూరం గెంతి అడిగిందిట. "నీకు అర్థం కావట్లేదు, సముద్రం చాలా పెద్దది" అంది.

"పోనీ, ఇంత ఉంటుందా?" అని నూతిలో ఈ చివరి నుండి ఆ చివరకు గెంతిందిట. "నువ్వు ఊహించలేవు, నీ నూతితో పోల్చలేము" అంది.

"ఛట్! నా నూతి కంటే పెద్ద సముద్రం ఉండనే ఉండదు. నువ్వు అబద్ధాలు చెబుతున్నావు, ఫో!" అందిట.

కేవలం భౌతిక శరీరం అనే నూతికే పరిమితం అయిన మనం,

చేతనత్వపు మహాసాగరం అంతటా విస్తరించిన వ్యక్తిత్వం యొక్క స్థాయిని, విశాలత్వాన్ని ఏ విధంగా అంచనా వేయగలం?



కొంత మంది గుడ్డివాళ్ళు ఏనుగు ఆకారాన్ని వర్ణించడం కథ కూడా మనకు తెలిసిందే.

తోక పట్టుకున్న వాడికి ఏనుగు పాములా ఉంటుంది.

చెవి పట్టుకున్న వాడికి చేటలాగా,

కాలు పట్టుకున్న వాడికి స్థంభంలాగా,

పొట్ట పట్టుకున్న వాడికి బోషాణంలాగా ఉంటుంది.

మన కంటికి కనిపించే భౌతిక జగత్తే కాకుండా, దీనికి ఆవల ఇంకొక ఆరు ఆవరణలు ఉన్నాయి అని ఆధ్యాత్మిక శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.

మన యొక్క భౌతిక జగత్తుకు సంబంధించిన జ్ఞానమే చాలా నగణ్యం.

అంటే భౌతిక జగత్తు విషయంలోనే ఇంచుమించు మనం గుడ్డివాళ్ళం.

అటువంటి మనం, చేతనత్వం యొక్క ఏడు ఆవరణలోనూ విస్తరించి జీవించే వ్యక్తిత్వం యొక్క వైభవాన్ని ఏ విధంగా గుర్తించగలం?

- అందుకే మాస్టరుగారు "నేను ఎవరో గుర్తించే ప్రయత్నం చేయకండి. ఇంకొక 1500 సంవత్సరాలకు కానీ, నేను ఎవరో మానవజాతి గుర్తించ లేదు" అని ఒక సందర్భంలో తెలిపారు.

మాస్టరుగారి చేతనత్వం యొక్క ఔన్నత్యాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవడం ఎందుకు అంటే,

అప్పుడు మాత్రమే ఆయన యొక్క కార్యక్రమాలను, సాధనా విధానాలను కొద్దో గొప్పో మనం సవ్యంగా అర్థం చేసుకోగలుగుతాం.

- తన బీజారోపణ కార్యక్రమాలకు అడ్డువస్తుంది అనే భావనతో ఉద్దేశ్య పూర్వకంగానే మాస్టరుగారు అధిక సంఖ్యాకులను తన కార్యక్రమాలకు, సాధనా విధానాలకు ఆకర్షితం కాకుండా చేశారు.

ఈ విషయాన్ని అమలాపురంలోని నాగమణిగారి ఇంట్లో మాస్టరుగారు చాలా స్పష్టంగానే తెలియజేశారు.

❀ "గురువు తన జీవిత కాలంలో బీజాలు మాత్రమే వేస్తాడు.
ఆయన వెళ్ళిపోయిన తరువాత అవి డెవలప్ అవుతాయి" అన్నారు.

❀ "మనం ఉండగా మనల్ని ఎవరూ గుర్తించలేరు.
మనం వెళ్ళిపోయిన తరువాత మన ఫొటోలకు, విగ్రహాలకు దండలు వేసి, పూజలు చేస్తారు" అని ఒక సందర్భంలో నాతో పేర్కొన్నారు.

**ఇప్పుడు ఇన్ని విషయాలను పత్రికలో ప్రస్తావిస్తూవుండటం ఎందుకు అంటే,**

❀ మాస్టరుగారు అనేక కార్యక్రమాలకు బీజాలు వేసుకుంటూ వెళ్ళిపోయారు.
-- ఇప్పుడు వాటికి నీరు, ఎరువు వేయాల్సిన బాధ్యత మన మీద ఉంది.

**కానీ ఒక విషయాన్ని మాత్రం మనం నిరంతరం గుర్తు చేసుకుంటూ ఉండాలి,**

❀ 24,000 రోజుల దివ్య ప్రణాళికతో భూమి మీద అవతరించిన చేతనత్వం,
-- ఒక రాముడో, కృష్ణుడో రెండు కిలోమీటర్ల దూరంగా ఉండే చేతనత్వం,
-- అఖండ గురుసత్తాలోని వ్యక్తులే డైరెక్ట్‌గా కలవలేని చేతనత్వం,
-- ఇంకొక 1500 సంవత్సరాలకు కానీ మానవజాతి గుర్తించలేని చేతనత్వం భూమి మీద నడయాడి జీవించినప్పుడు,

ఆ చేతనత్వం ఇచ్చిన భవిష్యవాణులు,
ఆ చేతనత్వం చేపట్టిన కార్యక్రమాలు,
ఆ చేతనత్వం అందజేసిన సాధనా విధానాలు,
ఆ చేతనత్వం అందజేసిన జ్ఞాన సంపద,
ఏ స్థాయిలో ఉండిఉంటాయి?



శ్రీ అణకువతో కూడిన భక్తి ఉంటే తప్ప కొద్దో గొప్పో వాటిని మనం అర్థం చేసుకోలేం. అది కూడా ఆయన అనుగ్రహంతోనే జరుగుతుంది.

**కానీ ఆ అనుగ్రహం మనకు కలగాలి అంటే,**

మనలో ఆ తపన ఉండాలి కదా!

15.10.1994 న నా భార్యతో కలిసి మాస్టరుగారిని అమలాపురంలోని శ్యామలరావుగారి ఇంట్లో కలిశాను. అప్పుడు ఆయన చెప్పిన అనేక విషయాలను ఇప్పటికీ మనస్సులో పదిలంగానే దాచుకున్నాను.

అందులో ఒక విషయం ఏమిటంటే

"వేరే వాళ్ళ పిల్లలు మన ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళకు చాక్లెట్లు ఇస్తాం. తినుబండారాలు ఇస్తాం. అప్పుడు మన పిల్లలకు కూడా వాటిని ఇవ్వం.

కానీ మన సంపద అంతా ఎవరికి ఇస్తాం?
మన పిల్లలకే ఇస్తాం.
గురువు కూడా అంతే. వేరే వాళ్ళకి చాక్లెట్లు ఇస్తాడు.
కానీ తన సంపద అంతా తన పిల్లలకే ఇస్తాడు.
కానీ గురువు యొక్క పిల్లలుగా ప్రవర్తించాలి?" అన్నారు.

❀ మాస్టరుగారి యొక్క పిల్లలుగా మనం జీవిస్తూ,
-- ఆయన స్థాయికి తగినట్లుగా ప్రవర్తిస్తూ
-- గురు పుత్రులు, గురు పుత్రికలుగా ఆయన చేపట్టిన కార్యక్రమాలను మనం కొనసాగిస్తూ ఉండే,
ఆయన ఎంత సంతోషిస్తారో మనం ఊహించగలం కదా!

❀✳❀

# మాస్టరుగారి అభిమానుల సమ్మేళనం

వాడరేవులోని శ్రీరామ హంస సమ్మార్త్రి ఆశ్రమంలో

అగస్టు 9 సాయంత్రం నుండి 10.8.14 మధ్యాహ్నం 3 గంటలు వరకు

వందలాది మంది మాస్టరుగారి అభిమానుల జీవితాలలో ఒక్కసారిగా శూన్యం ఆవరించింది.

ఇంత కాలం తమ జీవితంలో ఒక భాగంగా ఉన్న మాస్టరుగారు,
ఇంత కాలం తమ జీవితానికి ఆధారంగా ఉన్న మాస్టరుగారు,
ఇంత కాలం తమ జీవితానికి చుక్కానిగా ఉన్న మాస్టరుగారు
ఇక కనిపించరు అనే బాధ అందరి హృదయాలలోనూ పొంగిపొర్లింది.

భౌతిక శరీరధారి గురువు కానే కాడు!
భౌతిక శరీరాన్ని పట్టుకుని వ్రేలాడకండి!

అని పదే పదే హెచ్చరిస్తూ మాస్టరుగారు ఇచ్చిన శిక్షణ ఫలితం ఏమో, గుండె దిటువు చేసుకుని, అంత బాధను కార్యకర్తలు దిగమ్రింగుకోగలిగారు.

మాస్టరుగారు స్థూల శరీరంతో ఉన్నప్పటి కంటే,
ఆయన సూక్ష్మ శరీరంతో ఉన్నప్పుడే ఆయన యొక్క కార్యక్రమాలు వేగవంతం అవుతాయి అనే విషయాన్ని చాలా మంది గుర్తు చేసుకున్నారు.

12.7.14 న సప్తఋషి ఆశ్రమము, గుంటూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాస్టరుగారు స్థాపించిన అన్ని ఆశ్రమాలు, సంస్థలు, పీఠాలను చైతన్యవంతం చేయాలి అని, ఆయన ప్రారంభించిన కార్యక్రమాలను తిరిగి వేగవంతం చేయాలి అని అందరూ నిర్ణయించారు.





మాస్టరుగారి భౌతిక శరీరం యొక్క చివరి దర్శనం

అందులో భాగంగా ప్రతి నెలా ఏదో ఒక ఆశ్రమంలో లేదా పీఠంలో మాస్టరుగారి అభిమానులు అందరూ సమావేశం అవ్వాలి అని నిర్ణయించారు.

అగస్టు నెలలో శ్రావణ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని, 9.8.14 సాయంత్రం నుండి 10.8.14 మధ్యాహ్నం 3 గంటల వరకు "మాస్టరుగారి అభిమానుల సమ్మేళనం" జరుగుతోంది.

ఈ సమ్మేళనానికి తన అభిమానులు అందరూ హాజరయితే,
మాస్టరుగారు ఎంత ఆనందిస్తారో మన అందరకూ తెలిసినదే.

కావున మాస్టరుగారి అభిమానులు, క్రొత్త వారిని కూడా తీసుకొచ్చి ఈ సమ్మేళనంలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. వివరాలకు,

| | | | |
|---|---|---|---|
| వి. సుబ్బారావు | 99667 24683 | సుమా పటేల్ | 097414 15081 |
| విజయా విశ్వనాథ్ | 99490 88261 | జి. యుగంధర్ | 99490 88256 |
| ఎల్. రాజ్యలక్ష్మి | 94913 17670 | గురు సీతారామ్ | 90106 47325 |